# ఇంకొకరి వస్తువు

[కథానిక]

●

= శ్రీ 'రామచంద్ర కాశ్యప' =

"చిరంజీవి సరిపూడి నారాయణరావుకు—

మీమామగారు జగన్నాథం ఆశీర్వదించి వ్రాయునది ఏమనగా —ఉభయకుశలోపరి. మీఅత్తగారు చైత్రశుద్ధ నవమినాడు ప్రసవించినది. ఆడపిల్ల. పిల్లా, తల్లీ కులాసాగానే వున్నారు. బహుళ పంచమినాడు బారసాల. కనుక మీరు యావన్మందీ రాగోరెదను. తప్పకుండా రావలసినది. అమ్మాయిపిల్లల క్షేమం తెలియపర్చ వలయును. ఇంతే సంగతులు. —ము. జగన్నాథం."

"ఏమేవ్?"

"ఆఁ, ఏమిటో?"

"మా నాన్నదగ్గరనుంచి ఉత్తరం వచ్చింది."

"ఏమని?"

"మా అమ్మ నీళ్లాడిందట."

వంటింటిలోనుంచి సత్యవతి పరిగెత్తుకుంటూ హాల్లోకి వచ్చి—

"మగపిల్లాడేనా?"

"ఆఁ, మగపిల్లడే"

"నిజం? ఏదీ ఉత్తరం?"

ఉత్తరం సత్యవతికి అందిచ్చాను. చదువుకుంటూ "ఆడపిల్ల" అన్నమాటదగ్గర ఆగి, "అయ్యో!" అని దిగాలుముఖం వేసి నవ్వింది.

"సుఖంగా బారసాలకు రమ్మని ఉత్తరం రాస్తే 'అయ్యో' అంటా వేమిటి?"

"అదిగాదండీ. యీ ఆడపిల్లలవరుసకు అంతూ పంతూ లేదా ఏమిటి?"

నేను నవ్వుతూ—"ఆఁ, ఇప్పటి కెంతమంది? మాణిక్యం, సత్యవతి, విమల, విశాలాక్షి, ఊఁ, తర్వాత?"

"ఊఁ, మరీ సోద్యాలూ!"

"మరిచిపోయాను. సరోజ. ఆఁ"

"భువనేశ్వరి"

"ఊ! అవును. భువనేశ్వరి, శాంతా. అంతేనా?"

"చాల్లేద్దురూ, మీ వేళాకోళాలకు వేళా పాళా లేదు."

"సరేగాని యీ అమ్మాయికి మనం ఏంపేరు పెడదాం?"

"మనయిష్టమా ఏమిటి?"

"మనం చెపితే వద్దంటారా మీ నాన్న?"

"ఏమో బాబూ నాకేం తెలియదు."

"నే చెప్పేదీ?"

"చెప్పండి."

"సత్యాగ్రహి. ఎలా వుంది పేరు?"

"బాగానే వుంది. జైలుకు పంపిస్తారా ఏం?"

"వెళ్లవలసివస్తే తప్పుతుందా ఏమిటి?"

"సరేగాని, ఎప్పుడూ ప్రయాణం?"

"ఓహో, అదా హుషారు! మొన్ననేగా వచ్చింది?"

"బాగానే వుంది. తప్పకుండా రమ్మని రాస్తే......"

"సరే. నీయిష్టం. వెళ్లిరా."

"మరి మీరో?"

"నే నారోజుకు వస్తాలే."

"ఏం? కోర్టుపనులన్నీ మునిగిపోతున్నయ్యా?"

"ఇప్పటినుంచీ వచ్చి కూచోమంటా వేమిటి?

"మీయిష్టం బాబూ. మీకు సమాధానం చెప్పలేము."

ఇది పదహారేళ్ల క్రిందటి మాట!

* * * *

నేడు: వసంతపురంజిల్లాకోర్టు జనంతో కిటకిటలాడుతోంది. ఒక పెద్ద క్రిమినల్ కేసువిచారణ. నేరస్థుడు మంచి ఆస్తిపరుడు. గొప్ప పలుకుబడి కలవాడు. ఇతరులకు ఎన్నడూ హానిచేసి ఎరుగని

జగన్నాథంగారు. ఆయన చేసిన నేరం వయసులోవున్న ఒక ఆడపడుచును నిలువునా, నడిరోడ్డుమీద హత్యచేశాడని.

జగన్నాథంగారేమిటి, ఒక స్త్రీని హత్యచేయడమేమిటి ? ఆ కేసులో విశేషమేమిటంటే, జగన్నాథంగారు నేరాన్ని ఒప్పుకున్నారు. సరాసరి పోలీసుస్టేషనుకు వెళ్లి ఫలానా స్త్రీని, ఫలానా చోట నేనే హత్యచేశానని తానే రిపోర్టుయిచ్చాడు. వంటినిండా రక్తపుమరకలతో, చేతిలో ఒక గొడ్డలి పెట్టుకొని నేను ఫలానా మనిషిని చంపాను అంటే పోలీసులు ఆయన్ను—ఎంత ఘరానా మనిషయినా—అరెస్టుచేయక ఎలా వుంటారు ? ఆయనమీద హత్యానేరంక్రింద కేసు పెట్టారు. జిల్లాకోర్టులో కేసు విచారణకు వచ్చింది. ప్రాసిక్యూషన్ తరఫున గవర్నమెంటుప్లీడరు లేచి, జగన్నాథంగారు ఎలా హత్యచేసిందీ, ఎవరెవరు చూసిందీ, సాక్ష్యంతోసహా కట్టుదిట్టం చేసి కోర్టువారిని నమ్మించాడు. అప్పుడు జిల్లాజడ్జిగారు జగన్నాథంగారివంక తిరిగి "మీరు చెప్పదలచింది ఏమైనా వుందా ?" అని అడిగారు.

అప్పటివరకూ విచారణ అంతా తలవంచుకొని వింటున్న జగన్నాథంగారు తలయెత్తి, జడ్జీగారివంకా, జ్యూరీవంకా, ప్లీడర్లవంకా, అక్కడ క్రిక్కిరిసివున్న ప్రేక్షకులవంకా నిదానంగా చూసి, కోర్టువారికి నమస్కారం చేసి యిలా ప్రారంభించాడు—

"మొదటినుంచీ నేను చెపుతూనేవున్నాను—ఈ హత్య నేను చేశానని. అందుచేత గవర్నమెంటుప్లీడరుగారు హత్య నామీద నిరూపణచేయడానికి పడ్డ శ్రమ అనవసరం. కాని వారు తమ వాదనలో యీహత్య చేయడానికి నా కేవో విపరీతపు అభిప్రాయాలున్నవనీ, మతిచెడినైనా యీపని నేను చేసివుండవచ్చుననీ, అలా కోర్టువారు తలిస్తే నాకిచ్చే శిక్షలో కొంతవరకు తగ్గించినా తన కభ్యంతరం లేదనీ నామీద చాలా దయతలచి మాట్లాడారు. వారికి నా నమస్కృతులు. కాని ఈహత్య చేయడానికి కారణం నాకు మతి చలించడంవల్ల కాదని యీకోర్టువారికి నేను మనవిచేసుకుంటున్నాను. దానికి బలవత్తరమైన కారణాలు లేకపోలేదు. ఆకారణాలు ఏమిటో తమకు చెప్పాలంటే పదిహేనేళ్ల గాథ—నా జీవితగాథే చెప్పవలసిన అవసరం వుంది. కోర్టువారు నాయందు దయవుంచి తీరికగా, శ్రద్ధతో వినేటట్లయితే ఆవిషయాన్ని చెప్పడానికి ప్రయత్నంచేస్తాను. అనవసరంగా మీకాలాన్ని వృథాచేస్తున్నందుకు తమరు నన్ను క్షమించాలి.

నేను గౌరవమైన కుటుంబంలో పుట్టి, గౌరవమైన పద్ధతులలో పెరిగాను. భగవంతుడు నాకు తగినంత సంతానాన్ని కలగజేశాడు. నాకు ఎనమండుగురు సంతానం. అందరూ ఆడపిల్లలే..."

(ఇక్కడ కోర్టులో వున్న జనం పకాలున నవ్వారు.)

"అవును. ఇది మీకు నవ్వులాటవిషయం కావచ్చు. కాని, యీ ఆడపిల్లలే నాజీవితానికి ఆధారం. వాళ్ల సుఖదుఃఖాలే నా సుఖదుఃఖాలు. వాళ్ల జీవితాలలో యీ అభాగ్యజీవితాన్ని మిళితం చేశాను. వాళ్లకోసం నా సర్వస్వం ధారపోశాను.

భగవంతుని దయవల్ల అందరి పెళ్లిళ్లూ అయినవి. ఒక్కొక్క వివాహం ఒక్కొక్క గండంలాగా గడిచింది. పెళ్లి అయ్యేదాకా సరియైన సంబంధం తీసుకురాలేమోనని భయం. వరుడు నచ్చితే కట్నం భరించలేక ఆ సంబంధాన్ని వదిలివేయవలసివచ్చేది. కట్నం మోపగలిగితే వరుడు నచ్చడం కష్టమయ్యేది. కాని నా పూర్వజన్మసుకృతంవల్ల అందరికీ మంచి సంబంధాలే చేశాను. అన్నీకూడా తాము తిని ఒకరికింత పెట్టగల్గిన సత్తా వున్నవాళ్లే.

మా ఆఖరి అమ్మాయిపేరు సత్యాగ్రహి. మా రెండో అల్లుడు మాటమీద ఆపేరు పెట్టాం. ఆదేమి ఖర్మమో ఆ పిల్ల పుట్టడం మాలో ఎవ్వరికీ సంతోషాన్ని యివ్వలేదు. అప్పటికి మాకు ఏడుగురు ఆడపిల్లలు. మేమా పెద్దవాళ్లమయాం. ఈసారయినా మగపిల్లవాడు కలిగితే...యీ ఆశతో వున్నాం. కాని—మళ్లీ ఆడపిల్ల! ఈమాట చెప్పేసరికి నా కేం తోచిందికాదు. కాసేపు ఊరి అవతల కెళ్లి, నాయులదొడ్డిలో కూచొని మనస్సు కుదుటపరుచుకున్నాను. పిల్లతల్లి మనస్సులో ఏమనుకున్నదో కాని, బయటకు ఏం మాట్లాడేదికాదు. కాని తన పిల్లలను చూసుకునే యోగం దానికి ఎక్కువకాలం లేదు. సత్యాగ్రహికి అయిదవయేట దాని తల్లి గతించింది.

అప్పటికి ఆరుగురు పిల్లల పెళ్లిళ్లు అయినవి. యిక శాంత, సత్యాగ్రహీ మిగిలారు. శాంత కొంచెం అందమైన పిల్ల. చలాకీగా వుంటుంది. పెద్దదానిలాగా మాట్లాడుతుంది. దాని కప్పుడు ఎనిమిదో సంవత్సరం. ఇంట్లో నేనూ, మా యిద్దరుపిల్లలూ, ఒక విధవ చెల్లెలూ వున్నాం. నాకు నలభయి నిండినయి. మావూళ్లోవాళ్లు కొంతమంది నన్ను మళ్లీ పెళ్లిచేసుకోమనేవాళ్లుకాని నా కలాంటి ఆలోచన కలలోకూడా లేదు.

కాని, యీ యిద్దరుపిల్లల్ని పెంచే భారం నానెత్తిమీద పడ్డది. అందులో ముఖ్యంగా ఆడపిల్లల్ని పెంచడం మరీ కష్టం. పూలతోట పెంచినట్లుగా, అతిమెళుకువతో వేయికళ్లు పెట్టుకొని పోషించాలి. మీరు ఎక్కడైనా చూడండి. తలిదండ్రులు తమ ఆడపిల్లల్ని చూసినంత జాగ్రత్తగా మగపిల్లల్ని చూడరు. ఇంకొకరి వస్తువు మన యింట్లో వుంటే ఎంతో జాగ్రత్తగా చూస్తాం. 'మనది కూడా కాదు. జాగ్రత్త' అంటాం. యుగయుగాల్నుంచీ వస్తున్న పద్ధతికాబట్టి దాన్ని మనం తెలియకుండానే చేస్తాం. ఆడపిల్లలకు పరికిణీలు, గౌనులు, సబ్బులు, స్నోసుపౌడర్లు, కొద్దో గొప్పో నగలు—ఒకటేమిటి, అనేకం. దీనికంతటికీ కారణం ? 'ఇది మన వస్తువు కాదు. ఇంకొకరిది. దీన్ని జాగ్రత్తగా చూడకపోతే తరువాత మనకు మాటవస్తుంది' నాలుగేళ్ల పిల్ల కానివ్వండి. ఏదయినా తప్పుచేస్తే

'అమ్మో! యిది పెళ్లయితే ఎలా నెట్టుకుంటుందో కాని, ఒక్క పనికూడ చేతకాదుగదా!' అంటారు.

తల్లి లేకపోయినా వాళ్లకేలోటు లేకుండా పోషించాను. అవి శారదాబిల్లుకు ముందరరోజులు. శాంతకు పెళ్లీడు దగ్గరకు వచ్చింది. వాళ్ల తల్లి లేని లోపం అప్పుడు తెలిసివచ్చింది. ఏదయినా సంబంధం వస్తే వాళ్ల తల్లితో చెప్పకుండా, దాంతో ఆలోచించకుండా ఏపనీ చేసేవాణ్ణి కాదు. ఇప్పుడు నాకు సలహాచెప్పేవాళ్లెవరూ లేరు. అంటే వాళ్ల సలహా నాకు నచ్చిందికాదు. నాలో నేనే మథనపడటం. 'ఈడు సరిపోయిందా? ఆస్తి మనకు నచ్చినట్టేనా? కట్నం ఎంత యివ్వగలం? సాంప్రదాయం మంచిదేనా? పిల్ల సుఖపడుతుందా?'—అన్నీ నేను ఆలోచించవలసిందే.

చివరకు శాంతకు ఒక నచ్చిన సంబంధం చూసి పెళ్లిచేశాను. మా అల్లుడు కనిగిరిలో స్కూలుమాష్టరుగారి కొడుకు. వాళ్లకు దగ్గరదగ్గర నలభయి ఎకరాల మాగాణీ వుంది. ఇద్దరే మగపిల్లలు. పిల్లవాడు ఫిఫ్తుఫారం చదువుతున్నాడు. రెండువేల కట్నం. మొత్తం అయిదువేలదాకా అయినయి. వాళ్లుకూడా లాంఛనాలు బాగా జరిపారు. ఆ అయిదురోజులూ తల్లిలేని లోటు ప్రతిక్షణం కనబడేది. గుండెనిబ్బరంతో పనిచేశానన్నమాటేకాని మనస్సంతా కలవరపెట్టేది.

ఇక మిగిలింది సత్యాగ్రహి. రెండూ కలిపి చెయ్యమన్నారుగాని సరియైన సంబంధం ఒకటి దొరికేవరకే తలప్రాణం తోకకు వచ్చింది. అందులోనూ శాంతకు పెళ్లియీడు మించిపోతోంది. 'అయినంతవరకే మహాదేవ!' అని శాంతపెళ్లితో సంతృప్తిపడ్డాను.

కాని ఎన్నాళ్లీ యీసంతృప్తి? సత్యాగ్రహికి పదోయేడు వచ్చింది. మళ్లీ మొదలు. ఆఖరిపిల్ల! ఏమయినాసరే, దివ్యమయిన సంబంధం తీసుకురావాలి. నిజం చెప్పవద్దూ! సత్యాగ్రహి అంత అందమైన పిల్ల కాదు. అంటే కురూపి అనుకోకండి. చామనచాయ రంగు. మంచి కన్నులు. నిడుపాటి జడ. కాని చలాకీగా వుండే పిల్లకాదు. చాలా నిదానం. చదువులోకూడా చాలా నిదానమే! అప్పటికీ కష్టపడి తెలుగులో మంచిచదువు చెప్పించాను. పాటకూడా మంచి పండితుణ్ణి పెట్టి నేర్పించాను. సరే మా పాతహార్మోనియం వుండనేవుందికదా!

వేమూరిలో ముప్ఫయిరెకరాల ఆసామీకి ఒక్కడే కొడుకట. కాని వాళ్ల అబ్బాయి ఫోర్తుఫారందాకా చదివి మానేశాడు. లాభం లేదనుకున్నాను. తీరవరంలో యాభయి ఎకరాల ఆసామీ. ఇద్దరే కొడుకులు. రెండోవాడికి సంబంధం. కాని ఏం లాభం? పిల్లడు అంత అందంగా లేడు. పైగా స్ఫోటకంమచ్చలు. మొరటుగా వున్నాడు. ఆసంబంధంకూడా మానుకున్నాను. ఇలా కాలుగాలిన పిల్లిలాగా యిటూ ఆటూ తిరుగుతూనే వున్నాను.

చివరకు—నందవల్లిలో అన్నివిధాలా నచ్చిన సంబంధం. ఆవూరు కరణంగారు రామనాథంగారు మంచి ఆస్తిపరుడు. ఆయనకు ఏడెనిమిది మంది సంతానం కలిగి, పోయినవారు పోగా మిగిలినవాళ్లు ఒక కొడుకూ, కూతురూ. కూతుర్ని ఆవూళ్ళోనే చెల్లెలుకొడుక్కు యిచ్చి వివాహం చేశాడు. కూతురూ, అల్లుడూ చాలాభాగం వీళ్ల యింట్లోనే వుంటారట. ఇహ యీయన కున్న ఆస్తి నలభైఅయిదెకరాల మాగాణీ, ముప్పయి ఎకరాల మెట్టా, ఒక పెద్ద మామిడితోటా వున్నయి. పిల్లవాడు ఫిఫ్తుఫారం ప్యాసయి ఆఏడే స్కూలుఫైనలులో ప్రవేశించాడు.

ఇవన్నీ ఆలోచిస్తే యింతకన్నా మంచి సంబంధం తేవడం మనచేత కాదనుకున్నాను. దసరాముందు వాళ్లవూరు వెళ్లి కదిలించి చూచాను. ఫలానారోజుకు వచ్చి చూస్తామన్నారు. వాళ్లు వచ్చేటప్పటికి అంతా తయారుచేసివుంచాను. కరణంగారూ, కూతురూ, అల్లుడూ దిగారు.

అమ్మాయిని వాళ్లముందు తీసుకువెళ్లి కూచోపెట్టాను. సిగ్గుతో కుంగిపోయింది నాతల్లి. కరణంగారి కూతురు రామానుజమ్మ మా అమ్మాయిదగ్గరకు వచ్చి లాలనతో 'ఏం భయం లేదమ్మా, యిటు చూడు' అంది. సత్యాగ్రహి బెదిరే కళ్లతో కరణంగారివంకా, వారి అల్లుడువైపూ చూసి చివరకు నావంక దీనంగా చూస్తోంది.

'ఏమండీ, మీ అమ్మాయికి సంగీతమేమన్నా వచ్చా?' అని కరణంగారి అల్లుడు అన్నాడు.

'ఏదో, అదేలెండి. రెండేళ్లమట్టి నేర్చుకుంటోంది.'

'ఏదీ పాడమ్మా' అంది రామానుజమ్మ.

మాట్లాడకుండా తల వంచుకొని కూర్చుంది సత్యాగ్రహి. మళ్లీ, రామానుజమ్మ అందుకొని 'పాడమ్మా, పాడు. ఏపాటయినా సరే.' అంది. నావంక తిరిగి 'హార్మోనీ వుందా?'

నేను గబగబా లోపలికి వెళ్లి హార్మోనియం తీసుకువచ్చి సత్యాగ్రహిముందు పెట్టాను. సత్యాగ్రహి కదలలేదు, మెదలలేదు. మళ్లీ రామానుజమ్మ: 'ఇదుగో, వీళ్లంతా పరాయివాళ్లనుకున్నావా? ఎందు కాభయం?'

సత్యాగ్రహి మాట్లాడలేదు.

నాకు విసుగుపుట్టి 'ఎందుకమ్మా అంతసేపు బతిమాలించుకోవడం' అనగానే సత్యాగ్రహి తలఎత్తి చాలా దీనంగా నావంక చూసి పాట ప్రారంభించింది.

ఆపాట వినేటప్పటికి నాకు నవ్వూ, ఏడుపూ రెండూ వచ్చినయి. ఎంత కటువుగా వుండాలో అంత కటువుగానూ వుంది పాట. బడిపంతులుముందు నిలబడి పాఠం వప్పజెప్పే పిల్లడుకూడా అంత భయపడేవాడు కాదేమో! కరణంగారూ, ఆయనకూతురూ, అల్లుడూ మూతులు బిగించుకొని కూర్చున్నారు. 'ఇహ చాల్లే

అమ్మా' అన్నాడు కరణంగారి అల్లుడు. 'క్రొత్తవాళ్లదగ్గర పాడటం మాపిల్లకు అలవాటులేదండీ. లేకపోతే బాగానే పాడుతుంది' అని నేను నీళ్లునమిలాను.

కొంతసేపు ఆగి కరణంగారు 'సరే, మాకు సెలవిప్పించాలి' అన్నాడు.

'మరి మీ అభిప్రాయ మేమిటో చెపితే...'

'మేము యింటికి వెళ్లి ఉత్తరం రాస్తాం లెండి.'

'తొందరలో......'

'అలాగే, వస్తాం... సెలవు.'

ఒక నెలరోజులపాటు ఉత్తరంకోసం ఎదురుచూశాను. ఉపయోగం లేకపోయింది. ఈలోపల నాకెక్కడా అంతకన్నా మంచి సంబంధం తగలలేదు. అందుచేత నేనే సరాసరి ప్రయాణమై వంద వల్లి వెళ్లాను. అల్లుడుగారు వూళ్లో లేరట. వారంపదిరోజులలో గాని తిరిగిరారట. పదిరోజులాగి రమ్మన్నారు. పదిరోజులు ఆగి మళ్లీ వెళ్లాను. సావిట్లో కరణంగారూ, అల్లుడూ కూర్చొని వున్నారు. 'రండి, రండి' అని కాళ్లు కడుక్కోడానికి నీళ్లు యిచ్చి చాప వేసి కూర్చోపెట్టారు.

'ఇవాళో రేపో ఉత్తరం రాద్దామనుకుంటూవుంటే, మీరే వచ్చారు. పనితొందరలో మీమాటే మరిచిపోయాం' అని కరణంగారన్నారు.

'దానికేంలెండి! మీ ఉద్దేశ్య మేమిటో చెపితే...'

నామాట పూర్తికాకుండానే కరణంగారి అల్లుడు అందుకొని— 'ఉద్దేశ్య మేమున్నదయ్యండీ! మావాడికి పిల్లనిస్తామనీ, గొప్పకట్నాలిస్తామనీ తిరిగినవాళ్లు తిరుగుతూనేవున్నారు. ఏదో వున్నవాడు మాకు ఒక్కడేకదా అని తటపటాయిస్తున్నాం.'

అప్పుడు నేనన్నాను: 'మీయిష్ట మెలా వుంటే అలాగే కానీయండి.'

ఇక్కడ అందరూ రెండునిమిషాలు మాట్లాడకుండా ఊరుకున్నారు. కరణంగారి అల్లుడు యింట్లోకి వెళ్లాడు. ఆయనవెళ్లిన ఒక అయిదునిమిషాలకు కరణంగారుకూడా లోపలికి పోయి ఒక పావుగంటసేపు గుసగుసలాడారు. ఇంతలోనే కరణంగారి అల్లుడు సావిట్లోకి వచ్చి, నాముందు కూచొని, తలవంచి, పంచెఅంచు సర్దుకుంటూ—

"మరి, కట్నంమాట ఏమంటారు ?'

అమ్మయ్య! పిల్ల నచ్చిందికదా అని సంతృప్తిపడ్డాను.

'ఇంతవరకూ పదిహేనువందలూ, రెండువేలూ యిస్తూ వచ్చాను. ఇది నాకు ఆఖరుపిల్ల అవడంచేత నాలుగువేలదాకా పెడదా మనుకున్నాను.'

'అలాగా' అని ఒక్కనిమిషం ఆలోచించి 'మీకు ఉత్తరం రాస్తాంలెండి' అన్నాడు. 'ఉత్తరం రాస్తాం లెండి' అంటే, ఆ భాషలో 'మీకట్నం మాకు నచ్చలేదు!' అన్నమాట.

'పోనీ, మీ అభిప్రాయ మేమిటో చెపితే...'

'మా అబ్బాయికి ఏసంబంధం వచ్చినా పదివేలకు తక్కువగా ఎవ్వరూ అడగలేదు. మరి మీరు నాలుగువేలంటే నేను ఏం మాట్లాడేది చెప్పండి.'

ఎంత వ్యాపారసరళిలో మాట్లాడుతున్నాడో చూడండి!

'ఇంతవరకూ ఏడుగురు ఆడపిల్లల పెళ్లిళ్లు చేశాను. ఒక్క కట్నమే ముఖ్యమైన విషయం కాదు. సాంప్రదాయం, పిల్లమంచితనం ఎన్నో ఆలోచించాలి. అయినా నాకు మగపిల్లలు లేరు. వాళ్లే నాకు మగపిల్లలు. ఒక్క కట్నమేమిటి, నా ఆస్తి అంతా వాళ్లది కాదూ ?'

నేను యిలా మాట్లాడేటప్పటికి ఆయనకు కోపం వచ్చింది. 'అయితే యీవిషయాలేవీ మాకు తెలియవంటారా ఏం ?'

ఆయనమనస్సు చివుక్కుమందని గ్రహించాను.

'నాయనా, ఏదో పిల్లలుగలవాణ్ణిగనుక తొందరలో అన్నాను. మీకు తెలియని దేముంది బాబూ! నా మాటకూడా కొంచెం మన్నిస్తిరా నన్ను ఉద్ధరించినవాళ్లవుతారు.'

'సరే, మావాళ్లతో ఆలోచించి ఉత్తరం రాస్తాం లెండి' అని చెప్పి లేచాడు.

నేనూ లేవకతప్పింది కాదు.

'ఏదో తొందరలో తేలిస్తే—'

'అలాగే.'

మళ్లీ ఉత్తరం రాలేదు. పదిహేనురోజులాగి వందవల్లి వెళ్లాను. బేరం తొమ్మిదివేలవరకూ దిగింది. నాది అయిదువేలదాకా పెరిగింది. చివరకు ఆరువేలకూడా అన్నాను.

పిల్లకు పదకొండవయేడుకూడా వెళ్లిపోయింది. శాంతికార్యంచేయడంతొందరలో రెండునెల్లు వృథాగా గడిచిపోయినయి. మళ్లీ వెళ్లాను. ఏమయినా సరే, యీదఫా అటో యిటో తేల్చివద్దామని. చివరకు ఏడువేలా అయిదువందల రూపాయల కట్నం, లాంఛనాలు వగైరాలకు ఫైసలయింది. ముహూర్తం యింక మూడునెల్లకు.

సంతృప్తితో యింటికి తిరిగివచ్చాను. వచ్చి ఒక్కసారి సత్యాగ్రహిని కావలించుకొని ఏడ్చాను. 'అమ్మా, నువ్వుకూడా ఇంకొకరి వస్తువై పోతున్నావు. ఇహ యీయింటిలో మిగిలేది యీజీవం ఒక్కటే' సత్యాగ్రహి నామాటలు అర్థమయ్యీ, కాకా నన్ను కావలించుకొని అలాగే నిర్ఘాంతపోయి చూస్తోంది.

పెళ్ళికి బ్రహ్మాండమైన ప్రయత్నం చేశాను. ఇది నేను చేసే ఆఖరుపెళ్ళి. ఎంత దివ్యంగా వుంటే అంత మంచిది. పెద్దపెద్ద పందిళ్లు వేయించాను. ఎనిమిదిమంది వంటవాళ్లను పెట్టాను. ఒక యాభై గ్యాసులైట్లు. రీపులపైన రంగుకాగితాలతో అలంకరణాలు. రెండువందలరూపాయల మందుగుండుసామాను — ఒకటేమిటి, అనేకం!

పెళ్ళిరోజు వచ్చింది. రాత్రికి ముహూర్తం. ఉదయాన్నే పెళ్లివారు దిగారు. భోరున వర్షం. అందరినీ సాగదీసి కాలు బురద గాకుండా, పైబట్ట తడవకుండా విడిదిలోకి చేర్చేటప్పటికి నామచ్చ గాసింది.

పెళ్లి! అత్తగారు ఒక అమాయకురాలు. అంతా ఆడబిడ్డ పెత్తనమే. ఆవిడ ఏదయినా బాగుండలేదంటే అందరూ అదేవరస. రామానుజమ్మకు కోపంవస్తే భూనభోంతరాళాలు దద్దరిల్లేవి. ఆమె మాటల ధాటిలో కరణంగారూ, ఆమె భర్తా, నేనూ—అందరం చెత్తా చెదారంలాగ కొట్టుకొనిపోయేవాళ్లం. రామానుజమ్మను సంతృప్తి పరచడానికి అప్పటికప్పుడు బజారునుంచి రెండువందల రూపాయల మంచి బెనారసుచీర తెప్పించాను. ఆడబిడ్డకట్నంక్రింద అయిదు వందలరూపాయలు చదివించాను. పోలేరమ్మకు ఎంతసుగ్గిలం చేస్తే యేం? ఏవో లోపాలు వుండకమానవు. ఆమెకు వంగివంగి సలాములు చెయ్యలేక నా ప్రాణం విసిగిపోయింది.

నాలుగోరోజు తెల్లవారుఝామున అంపకాలు. ఆ నాలుగు రోజులనుండీ సత్యాగ్రహికి నిద్రలేదు. కళ్లంతా ఎర్రబారినయి. తూలుతూనే కూచుంది. ఇహ నాకు అంతూ వంతూ లేని దుఃఖం వచ్చింది. నాపిల్లలంతా వచ్చి నన్ను ఓదార్చజూచారు. కాని, నాయనా, పిల్లల్ని కన్నవాళ్లకే తెలుస్తుంది ఆబాధ. ఎనమండుగురు పిల్లలు. ఒకరివెంట ఒకర్ని యితరులకు వప్పగించాను. ఇదుగో యిది ఆఖరుపిల్ల. పువ్వులలో పెంచాను. బాధ అంటే ఏమిటో యెరుగని అమాయకురాలు. ఎలా చూసుకుంటారో?

* * * *

శాంతకూడా కాపరానికి వెళ్లిపోయింది. సత్యాగ్రహీ, నేనూ మిగిలాం. సత్యాగ్రహికి పదమూడుఏళ్లు నిండినయి. కార్యం చేయమంటూ ఉత్తరాలమీద ఉత్తరాలు వ్రాస్తున్నారు. ఉత్తరాలకు ఆమాటా యీమాటా సమాధానం రాసి కాలం వెళ్లబుచ్చుతూవుండే వాణ్ణి. కాని ఎంతకాలం తప్పించుకుతిరగగలను? చివరకు బలవంతం మీద లగ్నం నిశ్చయించాం.

ఆ శుభకార్యంకూడా అయిపోయింది. మరి నాలుగునెలలకే పిల్లను కాపరానికి పంపించమని తొందరచేయడం మొదలుపెట్టారు. 'నాయనా, నిన్నకాక మొన్న కళ్లు తెరిచింది. అప్పుడే కాపురమేమిటి?' అని నేను బతిమిలాడేవాణ్ణి.

'ఆఁ! తల్లికూడా లేకపోయె. మాయింటిదగ్గర పోషణ బాగా జరగదు. కనుక వెంటనే పిల్లను తీసుకొని రావలసిం'దని ఉత్తరాలు. నే నప్పటికీ మొండిగా వూరుకున్నాను. కరణంగారి అల్లుడు ఒకసారి మా ఊరు వచ్చి, మామీద నాలుగుకేకలు వేసి సత్యాగ్రహిని ప్రయాణం కట్టించాడు. అన్నాళ్లూ నిబ్బరంగా వున్న నాతల్లి ఆనాడు నన్ను కావలించుకొని బావురుమని ఏడ్చింది. బండితోపాటు చాలాదూరం సాగనంపివచ్చాను. వెనుదిరిగివస్తూవుంటే నాహృదయం బరువెక్కింది. నేను నడవలేకపోయాను. ఇల్లంతా వెలవెలపోతోంది. నా చిట్టితల్లిని, నా జీవజ్యోతిని ఎవరో దొంగిలించినట్లూ, లాక్కుపోయినట్లూ అనిపించింది. రాత్రిళ్లు నిద్రపట్టదు. ఒంటరిపాటును సహించలేక కన్నీటితో తలదిండ్లు తడిసేవి.

కాలం గడిచిపోతున్నది. వారంరోజు లయినతర్వాత చందవల్లి వెళ్లాను. 'వచ్చావా నాన్నా' అని అపరిమితమైన ఆనందంతో నన్ను కావలించుకుంది సత్యాగ్రహి. నే నేమని చెప్పేది? ఎన్నిసార్లు నాకు ఏడుపు వచ్చిందని చెప్పేది? మీకు విసుగుకూడా పుడుతుందేమో.

సత్యాగ్రహే నాకు కాళ్లు కడుక్కోడానికి నీళ్లు తెచ్చింది. ఇంతలోకే కరణంగారు చుట్ట వెలిగించుకుంటూ సావిట్లోకి వచ్చారు. మా అమ్మాయి యింట్లోకి వెళ్లిపోయింది. మళ్లీ నాకు కనబడలేదు. సాయంత్రం కరణంగారూ, నేనూ ఊరి అవతలకు వెళ్లి, కుప్పలువేసిన పొలాలన్నీ ఒక్కసారి చూచివచ్చాం. స్నానానికి నీళ్లు మా సత్యాగ్రహే తోడింది. స్నానం చేసి మడిబట్టలు కట్టుకుని భోంచేశాం. వాకిట్లో కూచొని కరణంగారితో మాట్లాడుతుంటే వారి అల్లుడు కూడా వచ్చాడు. ఆవూరి వ్యవహారాలూ, పార్టీలగురించి చాలాసేపు మాట్లాడాం. ఆ మరునాటి మధ్యాహ్నంవరకూ నాకు సత్యాగ్రహితో మాట్లాడే అవకాశం దొరకనేలేదు.

సత్యాగ్రహికి చాలా దిగులుగా వున్నది. నాకోసం బెంగపడి పోయింది. 'ఇంట్లో నిన్ను ప్రేమగా చూస్తున్నారా' అంటే అవు నన్నది. 'ఏమయినా పనులు చేయిస్తున్నారా' అంటే 'ఎక్కువలేదు నాన్నా' అంది.

'మరి నిన్ను తీసుకువెళ్లడానికి వచ్చానమ్మా' అన్నాను.

'పంపిస్తారో, లేదో?'

'ఎందుకు పంపించరు?'

'ఏమో, నా కేం తెలుసు?'

ఆ సాయంకాలం కరణంగారితో చెప్పాను. వీలులేదన్నారు. 'వచ్చి వారంరోజులుకూడా కాలేదుగదండీ. ఇదేమన్నా మీఅమ్మాయికి పరాయియిల్లా? అయినా కుప్పలుకొట్టే రోజులు, ఇంటినిండా బండెడంత చాకిరీ! ఇప్పుడు పిల్లను తీసుకువెళ్తానంటే ఎలా చెప్పండి?'

ఏదో మాఅమ్మాయికోసమే యీ పనిఒత్తిడంతా వచ్చినట్టు! నన్నసలు మారుమాట చెప్పనివ్వలేదు. సంక్రాంతిపండగకుతర్వాత కాని యీలోపల వీలుపడదన్నారు.

ఇంటికి తిరిగివచ్చినతర్వాత ఆతుర్దాగా, మాఅమ్మాయి —

'ఏంనాన్నా ఏమన్నారు?'

'ఇప్పుడు వీల్లేదన్నారు.'

'మరి...'

'సంక్రాంతిపండగ దాటింతర్వాతట.'

'అమ్మ నాయనో, నెలరోజులే!'

'ఏమిటమ్మా? నెలరోజులకే అంత ఖంగారుపడతావ్! ఇహ ముందుముందు సంవత్సరాలపర్యంతం వుండొద్దూ?'

'ఏమో నాన్నా, మరి నువ్వు గట్టిగా అడగలా?'

'ఎందుకు అడగలా! చివరకు వాళ్లయిష్టం కాని నాయిష్టమా?'

'మరి నువ్వు పండగ వెళ్లగనే వస్తావా?'

'అలాగేనమ్మా'

'తప్పకుండా రావాలి.'

'తప్పకుండా'

'ఎన్నిపనులున్నా సరే.'

'పిచ్చిదానా! నాకుమట్టుకు నువ్వు రావాలని వుండదూ?'

'ఏమోనాన్నా, నా కేం తోచడంలేదు.'

'ఏం? యిక్కడ నిన్ను సరిగ్గా చూడటంలా?'

'అదిగాదు.'

'మరేమిటి?'

'ఇక్కడ నా కేం తోచదు. చాలా కొత్తగా వుంటుంది. వాళ్లచూపులే నాకు నచ్చవు. మరీ...'

'మరీ?'

'మరీ, మాఆడబిడ్డ. ఆవిణ్ణి చూస్తే నాప్రాణాలు నిలువునా కుంగిపోతాయి'.

'అదేమిటమ్మా అలా అంటావ్? అలాంటివాళ్లనే మంచి తనంచేసుకోవాలి. తప్పకుండా? మరి నీఆయనో?'

'ఏమో, వారికి అక్కగారిమాట అంటే వేదవాక్యం.'

'అంచేత నువ్వు మరీ జాగ్రత్తగా వుండాలి. అత్తగారింట్లో ఎంత అణుకువగావుంటే అంత మంచిది.'

ఇలా బోధించి ఆ మరునాటిఉదయాన్నే మావూరు వెళ్లాను.

ఇంటికి రాంగానే సత్యాగ్రహిమాట పూర్తిగా మరిచిపోయాను. కుప్పలుకొట్టించడం, గల్లాను యింటికి చేర్పించడం —వీటితో నాకు యిరవైరోజులు క్షణం తీరుబడికూడా లేకపోయింది.

ఇంతలోకే మా మూడోఅల్లుడుదగ్గర్నుంచి, మాఅమ్మాయికి చాలా సుస్తీగా వుందనీ, వెంటనే బయలుదేరిరావలసిందనీ టెలిగ్రాం వచ్చింది. దానికి గుండెజబ్బు. ఏడాదికొకసారి క్రిందుట్టుమీదెట్టు చేస్తుంది. ఉన్నవాణ్ణి ఉన్నట్టుగా బయలుదేరివెళ్లాను. మాపిల్లలలో ఎవరికి జబ్బుచేసినా సరే, వాళ్లతల్లో దగ్గరవుంటే వాళ్లకు సగం రోగం తగ్గినట్లు వుండేది. అందుచేత అలాంటి వృత్తాంతం ఎప్పుడు వచ్చినా మాలో ఒకరం వెళ్లకతప్పదు. వాళ్లతల్లి పోయిననాటినుంచీ ఆబాధ్యతకూడా నానెత్తిమీద పడ్డది.

మా మూడోపిల్ల కోలుకునేటప్పటికి రెండునెలలు గడిచిపోయినయి. ఈలోపల ఒక్కసారికొమల్ను మాఊరు వెళ్లివచ్చాను. నిజంగా అది పునర్జన్మే! మూడురోజులు, అహోరాత్రులు మృత్యువుతో పోరాడింది. ఏనాడో మేం చేసుకున్న సుకృతంవల్ల బయటపడ్డది.

ఈలోగా నందవల్లికి రెండుమూడు ఉత్తరాలు రాశాను. సత్యాగ్రహి దిగులులేకుండా వుందనీ, తొందరలో మీరు నందవల్లి రాకపోయినా ఫరవాలేదనీ కరణంగారు ఉత్తరంరాశారు. దాంతో నామనస్సు కొంతవరకు కుదటపడ్డది. ఇంటికి రాంగానే ఉత్తరం రాశాను. ఫలానరోజున వచ్చి అమ్మాయిని తీసుకువెళ్తానని. దానికి కరణంగారు జవాబురాస్తూ, కొద్దిరోజుల్లోనే సావిత్రినోములు వస్తున్నాయనీ, అవి అయినతర్వాత కోడల్ని తీసుకువెళ్లవచ్చుననీ ఉత్తరం రాశారు. దాంతో నాప్రయాణం మళ్లీ ఒకనెలరోజుల దాకా వాయిదాపడింది. సావిత్రినోములు వెళ్లింతర్వాత నేనే మంచిరోజు చూసుకుని నందవల్లి చేరాను.

ఉదయం పదిగంటలయింది. వేసవికాలం దగ్గరకురావడంతో ఎండ కొంచెం తీవ్రంగానే వుంది. ఆ ఎండలో, తడిబట్టలతో, తనకు మించిన బిందె భుజాన పెట్టుకుని సత్యాగ్రహి దగ్గిరవున్న మంచినీటిభావినుండి మడినీళ్లు తీసుకువస్తోంది. దూరంలో నేను సత్యాగ్రహిని గుర్తించలేదు. దగ్గిరకురాగానే నాకళ్లను నేను నమ్మలేకపోయాను. అసలే చామనచాయగా వున్న పిల్ల పూర్తిగా నల్లబడింది. ముఖం పెంకులుబారింది. చాలా చిక్కిపోయింది. కళ్లు లోతుకుపోయినయి. మూడునెలల్లో పదిపదిహేనేళ్లు పైబడినట్లున్నాయి. నావంక చూసి ఆశ్చర్యంతో, సంతోషంతో, దుఃఖంతో ఒక్కనిమిషం అలా నిశ్చేష్టురాలుగా నిలబడిపోయింది.

'ఏమిటమ్మా, ఇలా ఉన్నావ్?' అన్నాను.

నామాటకు సమాధానం చెప్పకుండా 'అక్కయ్యకు ఎలా వుంది నాన్నా?' అని అడిగింది.

'ఇప్పుడు కులాసాయేనమ్మా. మరి నువ్వు...'

నామాట వినిపించుకోకుండా తలవంచుకొని యింట్లోకి వెళ్లిపోయింది. నాకేమీ తోచక కరణంగారి వాకిలిఅరుగుమీద కూలబడ్డాను. రెండునిమిషా లయింతర్వాత కరణంగారి అల్లుడు ఆవైపే